సాక్షి
జనగామ

గురువారం | 5 | జూన్ | 2025



శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి
ఖరీఫ్ పంటలు, విత్తనాల నాణ్యత, సాగు విధానంపై వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ఏడీఆర్ ఉమారెడ్డి తెలిపారు. - 12లో



'పీవీ విజ్ఞాన పీఠం' లేనట్లేనా!
కేయూలో భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విజ్ఞాన పీఠం ఏర్పాటు ఇక లేనట్లేననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. - 12లో

గరిష్టం/కనిష్టం
$37^0/25^0$

వాతావరణం
ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



జనగామ రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ముగిద్దాం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో 18 మంది, చిత్రలేఖనం పోటీలో 14 మంది జిల్లాలోని 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను డీఈఓ భోజన్న సందర్శించి విద్యార్థులను అభినందించారు. వ్యాసరచనలో మనోజ్ఞ, శ్రీ కార్మెల్ కాన్వెంట్ స్కూల్ పాలకుర్తి ప్రథమ స్థానం, పి.అక్షయ, కేజీబీవీ బచ్చన్నపేట ద్వితీయ స్థానం, ఎం.సంయుక్త, జెడ్పీఎస్ఎస్ ధర్మకంచ తృతీయ స్థానం, కె.నందిని, కేజీబీవీ స్టేషన్‌ఘన్‌పూర్ నాగులో స్థానంలో నిలిచారు. చిత్రలేఖనంలో టి.సహస్ర సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల పాలకుర్తి ప్రథమ, సీహెచ్.శివ ద్వితీయ, టి.గణేష్, లింగాలఘణపురం మోడల్ స్కూల్ తృతీయ, కన్సోలేషన్ బహుమతికి జి.శ్రీ విద్య, కేజీబీవీ స్టేషన్‌ఘన్‌పూర్ ఎంపికయ్యారు. వీరికి తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన బహుమతులు అందించనున్నారు.

విత్తనాల పంపిణీపై విచారణ

బచ్చన్నపేట : స్థానిక ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ద్వారా జరిగిన విత్తనాల పంపిణీపై పాలకుర్తి ఏడీఏ పరశురాంనాయక్ బృందం ఆధ్వర్యాన బుధవారం విచారణ చేపట్టారు. రైతులకు సబ్సిడీపై అందించాల్సిన జీలుగ విత్తనాలను ఆ షాపు యజమాని పక్కదారి పట్టించిన విషయం తెలిసిందే. ఆ విత్తనాలను తొర్రూరు వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకుని విచారించగా బచ్చన్నపేట నుంచి తీసుకొచ్చినట్లు వెల్లడైంది. అందులో భాగంగానే ఆగ్రోస్ షాపు ల్యాప్‌టాప్, విత్తనాల విక్రయ, స్టాక్ తదితర రికార్డులను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకుని ఆ దుకాణాన్ని సీజ్ చేసి అందులోని జీలుగ విత్తనాలను వేరే ప్రదేశానికి తరలించారు. విచారణలో భాగంగా కొడవటూర్, బసిరెడ్డిపల్లి, సదాశివపేట గ్రామాల్లో జీలుగ విత్తనాలు తీసుకున్న రైతుల నుంచి వివరాలు సేకరించి అవి ఎక్కడ విత్తారో పంట పొలాల వద్దకు క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలించారు. కొడవటూర్ రైతులకు 35 బస్తాల జీలుగ విత్తనాలు విక్రయించినట్లు రికార్డులో ఉండగా.. అక్కడ కేవలం ఏడుగురు రైతులకు ఏడు బస్తాలు మాత్రమే ఇచ్చినట్లు వెల్లడైందని సమాచారం. మరో రెండు రోజుల పాటు అధికారుల బృందం విచారణ చేపట్టనుంది.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



జనగామ రూరల్: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు బుధవారం ధర్మకంచలోని మినీ స్టేడియంలో చేపట్టారు. అనంతరం బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపగాని సుగుణాకర్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని, అలాగే భవిష్యత్‌లో మంచి కళాశాలలో స్పోర్ట్స్ కోటా కింద ఉన్నత విద్యకు అవకావం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మనోజ్‌కుమార్, ట్రెజరర్ అశోక్‌కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కై రిక హనుమంతరావు, సంతోష్‌కుమార్, బన్నీ, రామచంద్రం, పోరిక విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ర్యాపిడ్' ఫోర్స్ కవాతు



జనగామ: జిల్లా కేంద్రంలో బుధవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించింది. డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యాన ఏసీపీ పండేరి చేతన్‌నితిన్ నేతృత్వంలో నెహ్రూపార్కు నుంచి రైల్వేస్టేషన్ మీదుగా ఆర్టీసీ చౌరస్తా వరకు చేపట్టిన ఈ కవాతులో.. శాంతి భద్రల పరిరక్షణలో మేమున్నామంటూ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందం ప్రజలకు తెలియ జేసింది. అత్యవసర సమయంలో ప్రజలను కాపాడుతున్న తీరును వివరించింది.

ఆర్థిక బలోపేతమే లక్ష్యం

'ఉపాధి' పనుల ఎంపికలో మార్పులు

- తగ్గనున్న పూడికతీత పనులు
- గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ప్రాధాన్యం
- నీటి సంరక్షణలో 15 రకాల పనులు
- జిల్లా వ్యాప్తంగా 2.31లక్షల కూలీలు
- ఈఏడాది 28 లక్షల పనిదినాలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

జనగామ రూరల్: గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనుల ఎంపికలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. మట్టి పనులను పూర్తిగా తగ్గించి కూలీలు ఆర్థికంగా బలోపేతం అయ్యే పనులకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 28 లక్షల పనిదినాలుగా ప్రణాళిక ఖరారు చేశారు. ప్రధానంగా బిల్డింగులు, ఇతర నిర్మాణాలు చేపట్టనున్నారు. గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాలు, సీసీ రోడ్లు, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం, కిచెన్ షెడ్లు, పాఠశాలలకు ప్రహరీల నిర్మాణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

తగ్గనున్న పూడికతీత పనులు

ఉపాధి పథకంలో ఎక్కువగా చెరువు పూడికతీత పనులు చేపడుతుంటారు. ఈ పనుల పేరుతో ఏటా రూ.కోట్లలో నిధులు ఖర్చవుతున్నా ఆశించిన మేర ఫలితాలు కనిపించడం లేదు. మరోవైపు ఈ పనులు అక్రమార్కులకు మరింత లాభం చేకూరేలా ఉన్నాయి. సోషల్ ఆడిట్లోనూ తరచూ ఇవి బయటపడుతున్నాయి. నిరుపేద కూలీల పేరుతో రూ.లక్షల్లో నిధులు పక్కదారిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధి పనుల ఎంపికలో మార్పులు చేసి ప్రజలకు ఉపయోగపడే వాటికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా పూడికతీత పనులను చాలా వరకు తగ్గించారు.

ప్రాధాన్యత పనులకు లక్ష్యాలు

ఈ ఆర్థిక సంవత్సరం(2025–26)లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లా వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీలకు భవన నిర్మాణాలు, 54 అంగన్వాడీ కేంద్రాల భవనాలు, 54 చోట్ల పాఠశాలల కిచెన్ షెడ్లు, ప్రహరీలు నిర్మించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ మేరకు పనుల ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో లింకు రోడ్లకు కూడా ఉపాధి నిధులను కేటాయించనున్నారు.

2,31లక్షల మంది కూలీలు

గ్రామీణ ప్రాంత నిరుపేద కూలీలకు స్థానికంగా పనులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలోని 281 గ్రామాల్లో పనులు నడుస్తున్నాయి. మొత్తం 1,17,806 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. 2.34 లక్షల మంది కూలీలు పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో ఉపాధి పనులకు రెగ్యులర్‌గా వెళ్లే కూలీల సంఖ్య 1.28 లక్షలు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 50 రోజుల్లో రూ.20కోట్ల విలువైన పనులు చేపట్టారు.

నీటి సంరక్షణ పనులు

ఈసారి ఉపాధి హామీ పథకంలో నీటి సంరక్షణ పనులు కూడా చేపట్టనున్నారు. అలాగే వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రధానంగా చెక్ డ్యాంలు, పర్కులేషన్ ట్యాంకులు, ఓపెన్‌వెల్స్, ఫాంపాండ్లు, వాటర్ హార్వెస్టింగ్ పాండ్లు, రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, బోర్‌వెల్ రీచార్జ్ కట్టడాలు తదితర 15 రకాల పనులను ఈసారి కూడా ఉపాధి పథకంలో చేపట్టనున్నారు.

ఒక్కో మండలంలో చేపట్టనున్న పనులు ఇలా..

- క్యాటిల్ షెడ్స్ 20, అజొల్లా 20, వర్మికంపోస్ట్ 10, పౌల్ట్రీ షెడ్లు 20, అగ్రికల్చర్ రోడ్లు(10 కిలోమీటర్లు)
- హార్టికల్చర్ ప్లాంటేషన్ 10 ఎకరాలు, ఫాంపాండ్లు 40, పర్కులేషన్ ట్యాంకులు 5
- చెక్‌డ్యాంలు 2, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ 10, బోర్‌వెల్ రీచార్జ్ 10,
- ఇరిగేషన్ ఓపెన్ వెల్స్ 2, కమ్యూనిటీ సోక్ కిట్స్ 40, ప్రభుత్వ కార్యాలయాల్లో రోఫ్ టాప్ రీచార్జ్ స్ట్రక్చర్లు 25, వ్యక్తిగత మరుగుదొడ్లు 200 నుంచి 300.
- పీఆర్ డిపార్ట్‌మెంట్ ద్వారా సీసీ రోడ్లు(10 కిలోమిటర్లు), అంగన్‌వాడీ కాంపౌండ్ వాల్స్ 2, మండలాల్లో సొంత జీపీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు లేని వాటికి ఏర్పాటు చేయనున్నారు.

భవన నిర్మాణాలకు ప్రాధాన్యం

ఈ ఏడాది ఉపాధి హామీ పనుల్లో ప్రభుత్వం కొత్తగా పనులను ఎంపిక చేసింది. గతంలో పూడికతీత, ఇంకుడు గుంతలకు ఎక్కువ అవకాశం కల్పించగా.. ప్రస్తుతం భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చింది. ముఖ్యంగా జీపీ భవనాలు, మండలానికి రెండు చెక్‌డ్యాంలు, నీటి సంరక్షణ పనులు, పాఠశాల కాంపౌండ్ వాల్స్, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం చేపట్టనుంది. దినసరి కూలి రూ.307 ఉంది. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.



– వసంత, డీఆర్‌డీఓ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి/లింగాలఘణపురం: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం రఘునాథపల్లి మండలం నిడిగొండ, లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన అనంతరం మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని, మొదటి విడతలో ఇల్లు మంజూరు కాని అర్హులు ఆందోళన చెందవద్దని, త్వరలో రెండో విడతలో వస్తుందని చెప్పారు. 'ఎవరికీ రూపాయి లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు.. ఎవరైనా డబ్బులు అడిగితే నాకు తెలియచేస్తే వారి పని నేను చూసుకుంటా' అని భరోసా ఇచ్చారు. అవినీతికి అస్కారం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీఓ గోపిరాం, మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, ఎంపీడీఓలు గార్లపాటి శ్రీనివాసులు, జలేందర్‌రెడ్డి, ఎంపీఓ రఘురామకృష్ణ, తహసీల్దార్ మోహిన్సాముజ్జబ పాల్గొన్నారు.



నిడిగొండలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

రైల్వేవర్క్స్ సెక్షన్ల తనిఖీ

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధి బెల్లంపల్లి–రెచ్నీరోడ్ సెక్షన్‌లో చేపట్టనున్న రైల్వే ఎన్‌ఐ ఇంజనీరింగ్ వర్క్స్ లొకేషన్‌ను బుధవారం సికింద్రాబాద్ రైల్వే అధికారులు తనిఖీ చేశారు. రైల్వే ఏడీఆర్ఎం ఆపరేటింగ్ విభాగం గోపాలకృష్ణన్, ఇతర అధికారులు ఎన్‌ఐ బ్లాక్ సెక్షన్లను పరిశీలించి పలు సాంకేతిక విషయాలపై ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. కాగా ఈ బ్లాక్ పనులు 20వ తేదీ వరకు ఉంటాయని, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, కాజీపేట–బల్లార్షా రూట్లలో పలు రైళ్లను రద్దు, దారి మళ్లింపు, దూరం తగ్గించి నడిపిస్తున్నట్లు అధికారులు వివరించారు.

కేజీబీవీల్లో విద్యార్థినుల నమోదు పెంచాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న పింకేష్‌కుమార్

జనగామ రూరల్: కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో విద్యార్థినుల నమోదు పెంచాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. బుధవారం డీఈఓ భోజన్నతో కలిసి కలెక్టరేట్ నుంచి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. కేజీబీవీల్లో భద్రతతో కూడిన విద్య, నాణ్యమైన భోజనం, వసతులు కల్పిస్తున్న విషయాన్ని బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రణాళికతో 'బడిబాట' నిర్వహించాలని చెప్పారు. ఇంటర్ ఫలితాల గురించి తెలుసుకున్న కలెక్టర్.. పదో తరగతి పాసైన విద్యార్థినులు కేజీబీవీలోనే ఇంటర్‌లో వివిధ కోర్సులు తీసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో బాలికల అభివృద్ధి అధికారి గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'తో సత్వర పరిష్కారం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

రఘునాథపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న 'భూ భారతి' చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం ఇబ్రహీంపూర్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించిన అనంతరం ఆయన హెల్ప్ డెస్క్‌ను సందర్శించారు. రైతులు ఏ సమస్యలపై దరఖాస్తులు ఇస్తున్నారని కలెక్టర్ అడగ్గా వారసత్వం, సాదాబైనామాపై ఎక్కువ వచ్చినట్లు తహసీల్దార్ మోహిన్సాముజ్జబ వివరించారు. రైతులు భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఐ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, పంచాయతీ కార్యదర్శి నర్సింహ, ఎంఎస్.నరేష్, జూనియర్ అసిస్టెంట్లు ఐలమల్లయ్య, శారద, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు ఆకర్షణీయంగా ఉండాలి

జనగామ: పట్టణ సుందరీకరణ పనులు అత్యంత ఆకర్షణీయంగా ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. రూ.30 లక్షల నిధులతో చేపట్టిన సుందరీకరణ పనులను బుధవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించిన కలెక్టర్.. హనుమకొండ రోడ్డులో నిర్మిస్తున్న ఆర్చ్, విద్యుదీకరణ పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్–హైదరాబాద్ హైవేపై ప్రయాణించే వారికి ముఖ ద్వారం ఆకట్టుకునేలా ఉండాలన్నారు. స్వాగత తోరణంతో పాటు ప్రభుత్వ చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహిపాల్ సిబ్బంది ఉన్నారు.



ఇబ్రహీంపూర్ సదస్సులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి టౌన్: సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రాధాన్యత కల్పిస్తున్నదని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో ఉంటూ సిద్ధార్థ విద్యాలయంలో చదవి పదో తరగతిలో 557 మార్కులు సాధించి సీఎం ప్రతిభా పురస్కారం అందుకున్న విద్యార్థి ఈగ సందీప్‌ను ఆమె బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ జిల్లా నుంచి సందీప్ ప్రతిభా పురస్కారాన్ని పొందడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు డైట్ చార్జీలు 40 శాతం పెంచి ప్రోత్సహిస్తున్నదని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యాలో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సందీప్ తల్లిదండ్రుల తోపాటు సిద్ధార్థ విద్యాలయం ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, కరస్పాండెంట్ జక్కుల ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.



సందీప్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

- శాసన మండలి సభ్యుడు చిన్నమలై అంజిరెడ్డి

జనగామ రూరల్: దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే బీజేపీ లక్ష్యమని శాసన మండలి సభ్యుడు చిన్నమలై అంజిరెడ్డి అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనను పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రజల్లో ప్రచారం చేయాలని కార్యకర్తలు, నాయకులను కోరారు. తెలంగాణలో రహదారుల నిర్మాణానికి రూ.100 కోట్లు కేంద్రం వెచ్చించిందని, 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తోందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి మోదీ సర్కారు కట్టుబడి ఉందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నందరెడ్డి, ఆరుట్ల దశమంత్ రెడ్డి, కేవీఎల్ఎన్. రెడ్డి, లేగ రామ్మోహన్‌రెడ్డి, ఉడుగుల రమేశ్, శోభనబోయిన శివరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నమలై అంజిరెడ్డి

పునర్విభజన హామీల అమలుకు పోరాటం



జిల్లా మహాసభల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు

నర్మెట: పునర్విభజన హామీల అమలుకు కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. పార్టీ జిల్లా మహాసభల ముగింపు సందర్భంగా స్థానిక వినాయక గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభాప్రాంగణంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ ఎర్రజెండాను ఎగురవేసిన అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విభజన చట్టంలో తెలిపిన విధంగా బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, జనగామ నుంచి హైదరాబాద్ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో గుగులోత్ సఖి, మోతె శ్రీశైలం, చొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, సముద్రాల రాజు, జువారి రమేశ్, జీడి ఎల్లయ్య, నీల కనకయ్య, బోనగిరి కుమారస్వామి, పాతూరి ప్రశాంత్ రెడ్డి, చామకూర యాకూబ్ పాల్గొన్నారు.

'పచ్చని' వాతావరణం.. స్వచ్ఛమైన గాలి

జనగామ: 'పచ్చని వాతావరణంలో స్వచ్ఛమైన గాలి పీల్చుకుందాం.. పర్యావరణ పరిరక్షణకు ఉద్యమంలా కదులుదాం.. రేపటి భవిష్యత్ కోసం ప్రకృతిని కాపాడుకుందాం' అంటూ పర్యావరణ ప్రేమికులు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు తమవంతు కృషి చేస్తున్నారు. మట్టిని నాశనం చేస్తూ, ప్రమాదకరమైన ప్లాస్టిక్‌తో ప్రయాణిస్తూ వాతావరణ కాలుష్యానికి కారకులవుతున్న మానవ సమాజాన్ని మేల్కొలుపుతున్నా.. ఇంకా నిద్ర మత్తులోనే జోగుతున్నారు. నేడు(గురువారం) ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

పర్యావరణంపై మానవుడి దాడి

ప్రకృతి ఒడిలో పంచభూతాలు ప్రాణకోటి జీవజాతికి ఆధారం. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్య వంతమైన జీవనం వీటితోనే సాధ్యం. ప్రకృతితో పెనవేసుకున్న మానవుడి జీవితం ప్రమాదంలో ఉంది. చెరువులు, వాగులు, పచ్చని కొండలు కనుమరుగవుతున్నాయి. మానవులు పర్యావరణంపై చేస్తున్న ఈ దాడితో వాయు, నీటి కాలుష్యంతోపాటు పుడమిపై తీవ్ర ప్రభావం పడుతోంది. రోజురోజుకూ విస్తరిస్తున్న మహా నగరాలు, పట్టణాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగి ఆకుపచ్చని అడవులు కాంక్రీట్ వనాలుగా మారుతున్నాయి. 5.28 లక్షల ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న జనగామ జిల్లాలో అటవీ ప్రాంతం కేవలం 7,265 ఎకరాలు మాత్రమే. ఒక శాతం ఉన్న అటవీ ప్రాంతాన్ని 3 నుంచి 5 శాతానికి పెంచేందుకు 11 ఏళ్లుగా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఇప్పటికీ 0.05 శాతం అడవిని మాత్రమే పెంచగలిగారు.

అంతరిస్తున్న అటవీ ప్రాంతం

జిల్లాలో 1985 నుంచి 2018 వరకు కలప అక్రమ రవాణా జోరుగా సాగింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో చెట్లను నరికి క్రరను జిల్లా దాటించేస్తున్నారు. రోడ్ల విస్తరణ పేరిట మహా వృక్షాలను తొలగించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సాగు పెరిగింది. దీంతో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న చెట్లను తొలగించడంతో జిల్లా ఎడారిగా మారింది. దీనికి తోడు రియలెస్టేట్ వెంచర్ల పేరిట పచ్చని చెట్లను నరికి పర్యావరణానికి చేటు చేస్తున్నారు. మానవునికి నేలతో ఉన్న సంబంధాన్ని గుర్తెరిగి పర్యావరణాన్ని కాపాడుకుంటే అందరికీ మంచిది.

భవిష్యత్ తరాలకు అందిద్దాం

- ఇన్‌స్టంట్ వ్యవసాయం, ప్లాస్టిక్ పర్యావరణానికి ముప్పు
- కనుమరుగవుతున్న చెరువులు, వాగులు, పచ్చని కొండలు
- వాటిని కాపాడుకుంటేనే మానవుల మనుగడ
- 5.28 లక్షల ఎకరాల విస్తీర్ణంలో జిల్లా.. అటవీ ప్రాంతం ఉన్నది ఒక్క శాతమే

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం





శ్రీనివాస్‌రెడ్డి పెంచుతున్న వేప చెట్లు

ఇలా చేద్దాం..

- మొక్క నాటి పేరుపెట్టి మిత్రుడిగా చూసుకుందాం
- అది మన జీవన గమనంలో మైలురాయి అవుతుంది
- పిల్లలు, మనువలకు నీడ నిస్తుంది
- ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెబుదాం
- మట్టిలో కలిసి పోయే శ్రేష్టమైన బ్యాగులు వాడుదాం
- ఇంటిముందు నీటి పాత్ర పెట్టి పక్షులను కాపాడుదాం

భూమిపై మళ్లీ పుట్టే అవకాశం వస్తే..



భూమిపై మళ్లీ పుట్టే అవకాశం వస్తే ప్రకృతిలో ఏ రూపంలో పుట్టాలనుకుంటున్నారు. కొద్ది సేపు మౌనంగా ఉండి ఆలోచిస్తే సమాధానం లభిస్తుంది. మీరు పుట్టాలనుకునే రూపం ఈ భూమిని మీరు ఎంతగా ప్రేమిస్తారో చెబుతుంది. అప్పుడే పర్యావరణ పరిరక్షణ అంటే ఏమిటో తెలుసుకోగలుగుతాం.

– ఎండీ.గౌసియా బేగం, టీజీ నేషనల్ గ్రీన్ క్రాప్స్

అటవీ సంపదను సృష్టించాడు



పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు శ్రీనివాస్‌రెడ్డి. జనగామ మండలం సిద్దెంకి గ్రామం మాజీ సర్పంచ్. తనకున్న 30 నుంచి 40 ఎకరాల స్థలంలో 12 ఏళ్ల క్రితం 5వేల వేప మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు లక్షల రూపాయలు ఖర్చు చేశాడు. నేడు ఈ ప్రాంతంలో చిన్న పాటి అడవిని తలపించేలా వేప చెట్లు వృక్షాలుగా పెరిగాయి. రూపాయి ఆదాయం లేకున్నా పర్యావరణంపై ఉన్న మక్కువతో వేప చెట్లను పెంచుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతున్న శ్రీనివాస్ రెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు.

సగటు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి



ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సగటు ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా తరచూ తీవ్రమైన వడగాల్పులు, కరువు, వరదలు, తుపాన్లు తదితర విపత్కర పరిస్థితులకు దారితీస్తున్నది. ఇవి మానవ ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థపై వినాశకరమైన ప్రభావాలను కలిగిస్తాయి. ఈ పరిస్థితులను అధిగమించడానికి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులకు మారడం, ఇంధన సామర్థ్యాన్ని పెంచడం అత్యవసరం.

– డాక్టర్ ఎర్రోజు శ్రీనివాస్, సామాజిక వేత్త

పర్యావరణ రక్షకులుగా ఉందాం..



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. ముందు తరాలకు ఇవ్వాల్సింది ఆస్థిపాస్తులనే కాదు.. స్వచ్ఛమైన పర్యావరణాన్నికూడా. అందుకు మనమంతా పర్యావరణ స్పృహ కలిగి ఉండాలి. మన పిల్లల్లోనూ పర్యావరణంపై అవగాన పెంచాలి. నీరు, నేల, కాలుష్యం కాకుండా చూడాలి.

– త్రిపురారి పద్మ, సాహితీవేత్త, రచయిత్రి

క్లుప్తంగా

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

ఏటూరునాగారం: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులను స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేసి గ్రూప్స్, పోలీస్, బ్యాంకింగ్, రైల్వే ఇతర ఉద్యోగాలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎలాంటి శిక్షణ పొందని అభ్యర్థులు స్టడీ సర్కిల్ వెబ్‌సైట్స్ ద్వారా ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 75699 51515, 83285 46015 సంప్రదించాలని తెలిపారు.

25వరకు దూరవిద్య పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యలో పీజీ ఎంఏ, ఎంకామ్ కోర్సులకు ఎక్స్ అభ్యర్థులు, ఇంప్రూవ్‌మెంటు పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఈనెల 25వ తేదీవరకు ఫీజు చెల్లించాలని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ సూచించారు. అన్ని పేపర్లకు రూ.700, రెండు పేపర్ల వరకు రూ.600, ఇంప్రూవ్‌మెంటు ఒక్కో పేపర్‌కు రూ.300ల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆయా పీజీ కోర్సుల ఎక్స్ అభ్యర్థులకు ఈ ఏడాది జూలై–ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారని,టైంటేబుల్‌ను తర్వాత విడుదల చేస్తారని పేర్కొన్నారు.

ట్రాక్‌పై రాళ్లు.. ఇరువురిపై కేసు

- నిలిచిపోయిన వందేభారత్, గరీబ్‌రథ్ రైళ్లు

కాజీపేట రూరల్ : కాజీపేట–పెండ్యాల రైల్వే స్టేషన్ మధ్య ఆదివారం రైల్వే ట్రాక్‌పై బండ రాళ్లు పెట్టిన కేసులో ఇరువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు బుధవారం కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ ఛటర్జీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు రైల్వే కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు. ఈక్రమంలో ఏమైతదో చూస్తమని రైల్వే ట్రాక్‌పై బండ రాళ్లు పెట్టారు. దీంతో అప్‌లైన్‌లో వందేభారత్, డౌన్ లైన్‌లో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 20 నిమిషాల పాటు నిలిచిపోయినట్లు ఛటర్జీ వివరించారు. బండరాళ్లు పెట్టిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చి పంపినట్లు సీఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు, పటిక, బెల్లం ధ్వంసం

అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యం బాటిళ్లతోపాటు పటిక, బెల్లంను ధ్వంసం చేసినట్లు కాజీపేట జీఆర్పీ సీఐ వి.నరేష్‌కుమార్ బుధవారం తెలిపారు. క్వార్టర్ బాటిళ్లు–96, 90ఎంఎల్ బాటిళ్లు–384, 30 కిలోల బెల్లం, 8 కిలోల పటికను ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, జీఆర్పీ సీఐ నరేష్‌కుమార్, ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్ సమక్షంలో ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడిపై యువతి కుటుంబసభ్యుల దాడి

హన్మకొండ కల్చరల్ : తన కూతురుకు ఫోన్ చేసి వేధిస్తున్నాడని యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన వరంగల్ భద్రకాళి దేవాలయంలో చోటు చేసుకుంది. బుధవారం ఉదయం భద్రకాళి దేవాలయం ఆవరణలో యువతి తల్లి యువకుడిపై తీవ్రంగా కొట్టింది. యువకుడు ఫోన్ చేసి వేధించడంలో వాస్తవం లేదని స్నేహితులు చెప్పున్నా వినకుండా దాడికి పాల్పడింది. భద్రకాళి దేవాలయంలో బందోబస్తు నిర్వహిస్తున్న మట్టెవాడ సీఐ గోపి స్పందించి యువకుడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ-సైన్‌తో రిజిస్ట్రేషన్లు..

- ఇప్పటికే స్లాట్ బుకింగ్.. ఏఐతో చాట్‌బాట్
- పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన వరంగల్ రూరల్

కాజీపేట అర్బన్: మారుతున్న కాలానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ అత్యాధునిక టెక్నాలజీతో అనుసంధానం అవుతూ భూక్రయ విక్రయదారులకు సత్వర సేవలను అందించేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్, వాట్సప్ చాట్‌బాట్ ఏఐ టెక్నాలజీతో సేవలు అందిస్తుండగా ఇప్పుడు ఈ–సైన్ రిజిస్ట్రేషన్ విధానానికి శ్రీకారం చుట్టింది.

సాంకేతికతతో సేవలు..

రోజంతా రిజిస్ట్రేషన్ నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేచి ఉండకుండా కోరుకున్న తేదీ, కోరుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ చేసేందుకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఏప్రిల్ 10వ తేదీన స్లాట్ బుకింగ్ పద్ధతిని అందుబాటులోకి తీసుకొచ్చింది. కాగా జూన్ 2వ తేదీన పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన స్లాట్ బుకింగ్ విధానం రాష్ట్రంలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ పద్ధతి పని చేస్తుంది. స్లాట్ బుకింగ్ చేసుకునే తరుణంలో ఏర్పడే సందేహాలకు సమాధానం వాట్సప్ ద్వారా అందించేందుకు వాట్సప్ చాట్‌బాట్ పేరిట జూన్ 2వ తేదీన 82476 23578 నంబర్‌ను ఏఐ టెక్నాలజీతో భూభారతి స్లాట్ బుకింగ్ పేరిట ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి పూర్తి పారదర్శకతతో కూడిన ఈ ఆధార్ అనుసంధానంతో కూడిన ఈ–సైన్ విధానానికి శ్రీకారం చుట్టారు.


ఈ –సైన్ విధానంతో ఇలా...

భూక్రయవిక్రయదారులు తమ భూమి దస్తావేజులను తయారు చేసుకుని రిజిస్ట్రేషన్ నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా తామ తయారు చేసుకున్న దస్తావేజులపైన భూక్రయవిక్రయదారులు, సబ్ రిజిస్ట్రార్ వేలిముద్రతోపాటు సంతకాలు చేస్తుంటారు. ఈ–సైన్ విధానంలో భూక్రయవిక్రయదారులు తయారు చేసుకున్న దస్తావేజుల్లో వేలిముద్రతోపాటు సంతకాలు చేస్తారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిమిత్తం ఫొటోలు దిగడం, బయోమెట్రిక్ విధానంలో ఆధార్ కార్డును అనుసంధానం చేసేందుకు వేలిముద్రను వేస్తారు. వేలిముద్ర ఆధారంగా భూక్రయవిక్రయదారులతోపాటు సబ్ రిజిస్ట్రార్ ప్రింట్ తీసిన డాక్యూమెంట్‌పై సంతకం చేయరు. ఈ–సైన్ ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ ఆధార్‌ను అనుసంధానం చేసుకుని సంతకాన్ని పసిగట్టి గ్రీన్ కలర్‌లో రైట్ టిక్ మార్క్‌ను చూపిస్తుంది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లుగా సబ్ రిజిస్ట్రార్ నిర్ధారిస్తారు. కాగా ఈ–సైన్ విధానంతో పూర్తి పారదర్శకతతోపాటు సమయం ఆదా అయ్యే అవకాశం ఉంది.



'వరంగల్ రూరల్'లో ఈ-సైన్ విధానం..

ఈ–సైన్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పైలెట్ ప్రాజెక్ట్‌గా రాష్ట్రంలో కూసుమంచి, ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల మొదటివారంలో ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ రూరల్ కార్యాలయాన్ని సైతం ఈ–సైన్ రిజిస్ట్రేషన్ పద్ధతిలో ఎంపిక చేశారు. ఇందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను త్వరలో వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏర్పాటు చేసి ఈ నెల రెండో వారంలో ఈ–సైన్ విధానంతో రిజిస్ట్రేషన్లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



ఈ-సైన్ విధానంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నమూనా

త్వరలో నూతన విధానంతో రిజిస్ట్రేషన్లు



ఈ–సైన్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆర్మూర్, కుసుమంచిలో టెస్ట్ డ్రైవ్‌గా ప్రారంభించారు. జూన్ రెండో వారంలో వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ విధానంలో రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తాం.

– ఫణీందర్, జిల్లా రిజిస్ట్రార్

చట్నీలో బల్లి అవశేషాలు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సిరాజొద్దీన్



హోటల్‌లో తనిఖీ చేస్తున్న డీసీపీ, ఏఎస్పీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు

- వినియోగదారుడి ఫిర్యాదు
- సాయికృష్ణ హోటల్ సీజ్.. రూ.10వేల జరిమానా



చట్నీలోని బల్లి అవశేషం

జనగామ: జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ ఏరియాలోని సాయికృష్ణ హోటల్ నుంచి బుధవారం ఓ వినియోగదారుడు తీసుకెళ్లిన వడ–చట్నీలో బల్లి అవశేషాలు కనిపించాయి. గిర్నిగడ్డకు చెందిన ఎండీ.సిరాజొద్దీన్ తన కుటుంబ సభ్యుల కోసం సదరు హోటల్‌లో ఐదు ప్లేట్ల వడ పార్సిల్ తీసుకెళ్లాడు. టిఫిన్ చేస్తున్న క్రమంలో చట్నీలో పొట్ట పగిలి నలిగిపోయిన బల్లి అవశేషాలు కనిపించడంతో అలాగే తీసుకెళ్లి హోటల్ నిర్వాహకులకు చూపించగా ఆకుకూర కావచ్చు అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో సిరాజొద్దీన్ నిలదీయడంతో హోటల్‌లోని పలువురు దబాయించగా బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్, సీఐ దామోదర్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి బృందం హోటల్‌ను తనిఖీ చేశారు. అధ్వానంగా ఉన్న కిచెన్‌ను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమికంగా చట్నీలో బల్లి అవశేషాలు ఉన్నట్లు గుర్తించామని, ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. హోటల్ యజమానికి రూ.10వేల జరిమానా విధించి సీజ్ చేశారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

- రీజనల్ మేనేజర్ శ్రీనివాసు

వరి విత్తన రకాలు	నిల్వలు (క్వింటాలు)	సంచి బరువు	ధర
ఎంటీయూ–1010	640.75	25కేజీలు	రూ.960
కేఎన్ఎం–1638	899.50	25కేజీలు	రూ.1,075
టీపీటీ–5204	2,649	25కేజీలు	రూ.950
ఆర్ఎన్ఆర్–15048	376	15కేజీలు	రూ.700
కేఎన్ఎం–118	1,380	25కేజీలు	రూ.960

మడికొండ: వానాకాలం సాగుకు సంబంధించి రైతులకు సబ్సిడీలో అందించే విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వరంగల్ జిల్లా రీజనల్ మేనేజర్ శ్రీనివాసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యవసాయధికారి వద్ద అనుమతి తీసుకొని వ్యవసాయధికారి కార్యాలయంలో లేదా.. మన గ్రోమోర్, పీఏసీఎస్ సొసైటీ నుంచి రైతులు విత్తనాలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు ప్రైవేట్ షాపులను ఆశ్రయించకుండా ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీనివాసు తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు గ్రామస్తుల స్వాగతం

- ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని ఇంటికి చేరిన సంపత్‌గౌడ్
- దిష్టితీసి ఇంట్లోకి ఆహ్వానించిన తల్లి



సంపత్‌గౌడ్‌కు దిష్టి తీస్తున్న తల్లి కౌసల్య

కురవి: పాకిస్తాన్‌కు భారత్‌కు మధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని గ్రామానికి చేరిన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన కొత్త కౌసల్య–కృష్ణ(లేట్)ల కుమారుడు జవాన్ కొత్త సంపత్‌గౌడ్‌కు గ్రామస్తులు బుధవారం ఘనస్వాగతం పలికారు. జమ్మూకాశ్మీర్‌లోని సాంబా జిల్లా సెక్టార్‌లో హవాల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సంపత్‌గౌడ్ ఆపరేషన్ సిందూర్‌లో వీరోచితంగా పోరాడి బుధవారం స్వగ్రామానికి చేరాడు. సంపత్ ఊరిలోకి రాగానే గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. తల్లి కౌంసల్య తన కుమారుడికి దిష్టితీసి ఇంట్లోకి ఆహ్వానించింది. అనంతరం గ్రామస్తులు, జర్నలిస్టులు జవాన్ సంపత్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రముఖులందరు సన్మానించారు. ఈ సందర్భంగా జవాన్ సంపత్ మాట్లాడుతూ.. దేశానికి సేవ చేయడం గర్వంగా భావిస్తున్నట్లు చెప్పారు. పాకిస్తాన్‌పై జరిగిన పోరాటంలో పాల్గొనడంతో జన్మధన్యమైందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ పోతుగంటి వెంకన్న, జర్నలిస్టులు బేతమల్ల సహదేవ్, కొప్పుల శ్రీనివాస్, బీజేపీ జిల్లా నాయకుడు బుడిగె భద్రసేనాగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ అంతటి ఉపేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి విషయంలో పోలీస్ స్టేషన్‌లో ఘర్షణ

- ఇరువురిపై కేసు నమోదు

నల్లబెల్లి: ప్రేమ పెళ్లి విషయంలో రెండు కుటుంబాల మధ్య పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘర్షణ జరగడంతో పోలీసులు చెదరగొట్టారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఏఎస్సై లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పల్లెబోయిన మణిరాజ్.. గత నెల 24న శాయంపేట మండలం ఆరెపల్లికి చెందిన వడాల నితీషను ప్రేమ వివాహం చేసుకుని శాయంపేట పోలీసులను ఆశ్రయించడంతో ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. మణిరాజ్ తన భార్యతో కలిసి ఇటీవల నల్లబెల్లి మండలం శనిగరం గ్రామంలోని తన చిన్నమ్మ సముద్రాల స్వాతి ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న నితీష తల్లిదండ్రుల తోపాటు కుటుంబ సభ్యులు మంగళవారం శనిగరం చేరుకొని మణిరాజ్–నితిషలను అప్పగించాలని దూషిస్తూ స్వాతిపై దాడి చేశారు. దీంతో మణిరాజ్ 100 కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. పోలీసుల రాకను గమనించి వారు పారిపోయారు. కాగా ఇరువురిని బుధవారం పోలీసులు పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వడాల రాజిరెడ్డి తన బంధువుల సహకారంతో కుమార్తె నితీషను పోలీస్ స్టేషన్ నుంచి బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. సముద్రాల బాలరాజు, స్వాతితోపాటు పలువురు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అప్రమత్తమైన పోలీస్‌లు వారిని చెదరగొట్టి నితీషను స్టేషన్‌లోకి తీసుకెళ్లి కౌన్సిలింగ్ చేశారు. భర్తతోనే ఉంటానని తేల్చిచెప్పడంతో నితిష కుటుంబ సభ్యులు, బంధువులను అక్కడి నుంచి పోలీసులు పంపించారు. బుధవారం జరిగిన దాడికి సంబంధించి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కేయూలో 'పీవీ విజ్ఞాన పీఠం' లేనట్లేనా?

- ముగిసిన పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్ పదవీకాలం
- ఇక అడ్మిషన్ల డైరెక్టరేట్‌గానే నూతనభవనం



కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ భవనం వద్ద ఏర్పాటు చేసిన పీవీ నాలెడ్జ్‌సెంటర్ బోర్డు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో భారత మాజీ ప్రధానీ పీవీ నర్సింహారావు విజ్ఞాన పీఠం ఏర్పాటు ఇక లేనట్లేననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2021లో పీవీ నర్సింహారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలో పీవీ నర్సింహారావు విజ్ఞాన పీఠాన్ని ఏర్పాటు చేయనున్నట్లుగా హైదరాబాద్‌లో నిర్వహించిన పీవీ శతజయంతి ఉత్సవాల సభలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. విజ్ఞానపీఠం ఏర్పాటుకు ముందుకెళ్లాలని అప్పటి కేయూ వీసీ తాటికొండ రమేష్‌కు సూచించారు. కానీ, నిధులు మాత్రంను కేటాయించలేదు. ఈనేపథ్యంలో కేయూలో అడ్మిషన్ల డైరెక్టరేట్ కోసం నిర్మించిన నూతన భవనంలోనే పీవీ విజ్ఞానపీఠం ఏర్పాటు చేస్తున్నట్లుగా గత వీసీ రమేష్ ప్రకటించారు. పీవీ విజ్ఞానీఠం పేరుతో ప్రారంభోత్సవం చేసి బోర్డు కూడా ఏర్పాటు చేశారు. కానీ, ఆ భవనాన్ని అడ్మిషన్ల డైరెక్టరేట్‌గానే కొనసాగించాలని ప్రస్తుత యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు.

రూ.3 కోట్లకు ప్రతిపాదన

అప్పటి వీసీ తాటికొండ రమేష్.. పీవీ విజ్ఞానపీఠం ఏర్పాటుకు రూ.3 కోట్లు అవసరమని అప్పటి ముఖ్యమంత్రికి ప్రతిపాదించారు. విజ్ఞానపీఠం ఏర్పాటుచేస్తే ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే అంశంపై అప్పటి వీసీ అచార్యులు, రిటైర్డ్ ఆచార్యులతో సమావేశాలు ఏర్పాటుచేసి సలహాలు సూచనలు సేకరించారు. విజ్ఞానపీఠానికి భవనం, ప్రొఫెసర్, ఫీల్డ్‌లో విషయ సేకరణకు ఇద్దరు రీసెర్చ్ అసోసియేట్స్‌ను నియమించుకోవాలనేది అప్పటి వీసీ ప్రతిపాదన. ముఖ్యంగా పీవీ అమలుచేసిన ఆర్థిక సంస్కరణలు, ఫలితాలపైన పరిశోధనా పత్రాలు పబ్లిష్ చేసేందుకు జర్నల్ తేవాలని, సెమినార్లు నిర్వహించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ నాటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. అయినప్పటికీ వీసీ రమేష్ పీవీ విజ్ఞాన పీఠం పేరిట సదస్సులు నిర్వహించారు. రాజనీతిశాస్త్ర విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గద్దం కృష్ణయ్యను నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్‌గా గత ఏడాది మే 15న నియమించారు. ఈఏడాది మేతో 16తో ఆయన పదవికాం ముగిసింది. దీంతో పీవీ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు కలగానే మిగిలిపోనుందని భావిస్తున్నారు.

ఒక భవనం.. రెండు కార్యాలయాలు..

కాకతీయ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన అడ్మిషన్ల డైరెక్టరేట్ భవనంలోనే పీవీ విజ్ఞానపీఠం ఏర్పాటుచేస్తున్నామని పీవీ నాలెడ్జ్‌సెంటర్ అని బోర్డు ఏర్పాటు చేశారు. కెహెచ్‌తోపాటుగా వివిధ నూతన భవనాల ప్రారంభోత్సవంలో భాగంగా విజ్ఞాన పీఠం పేరుతో ప్రారంభం చేయించారు. ఆ తర్వాత భవనం వద్ద కేవలం బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. విజ్ఞానపీఠం ఏర్పాటుచేయలేదు. ప్రస్తుతం డైరెక్టర్ పదవి కాలం ముగిసిపోయింది.

ఇక అడ్మిషన్ల డైరెక్టరేట్‌గా మార్పు

పీవీ విజ్ఞానపీఠం ఏర్పాటుకు నిధులు లేకపోవడంతో తాటికొండ రమేష్ అనంతరం కేయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రతాప్‌రెడ్డి.. ఆ నూతన భవనాన్ని కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్‌గానే కొనసాగించాలని నిర్ణయించారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు వెలవరించారు. వాస్తవంగా ఆ భవనాన్ని నిర్మించింది అడ్మిషన్ల డైరెక్టరేట్ నిధులతోనే. పాత అడ్మిషన్ల డైరెక్టరేట్ నుంచి ఫర్నీచర్ తదితర సామగ్రిని నూతన భవనంలోనికి తీసుకొచ్చారు.

ఆన్‌లైన్‌సెంటర్‌గా మార్చాలనే యోచన



కొన్నేండ్లుగా ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ కార్యాలయంలో అడ్మిషన్ల ప్రక్రియ లేదు. ఎప్‌సెట్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ లాంటి ప్రవేశాలకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హెల్ప్ లైన్‌సెంటర్‌గా మాత్రమే ఉంటుంది. అందువల్ల ఈ నూతనభవనాన్ని ఆన్‌లైన్ సెంటర్‌గా మార్చాలనే యోచనలో ఉన్నాం. తద్వారా రాష్ట, జాతీయ స్థాయిలో జరిగే వివిధ సెట్‌లను కేయూ ఆధ్వర్యంలో నిర్వహించుకోవచ్చు.

– ప్రొఫెసర్ సీజె. శ్రీలత, కేయూ అడ్మిషన్ల డైరెక్టర్

నిధులకోసం ప్రతిపాదిస్తాం



కేయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా యూనివర్సిటీలో అభివృద్ధి కార్యక్రమాలకు ఈప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపబోతున్నాం. అందులోనే పీవీ విజ్ఞానపీఠం భవనంకోసం నిధులకు ప్రతిపాదిస్తాం. ఆ భవనాన్ని అడ్మిషన్ల డైరెక్టరేట్ కోసమే నిర్మించాం. విజ్ఞానపీఠం ఏర్పాటుచేయాలనే గత వీసీ యోచనతో బోర్డు ఏర్పాటు చేశాం. నిధులు లేకపోవడంతో పీఠం ఏర్పాటుచేయలేకపోయారు.

–వాసుదేవరెడ్డి, కేయూ అభివృద్ధి అధికారి

శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలి

- పంట మార్పిడితో రైతులకు మేలు
- జయశంకర్ విశ్వవిద్యాలయ వ్యవసాయ విస్తరణ సంచాలకులు యాకాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న యాకాద్రి

మామునూరు: వానాకాలం(ఖరీఫ్) పంటలు, విత్తనాల నాణ్యత, సాగు విధానంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ ఉమారెడ్డి, జయంశంకర్ విశ్వవిద్యాలయ వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి అన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి బుధవారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట రైతు వేదిక సమావేశ మందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వరంగల్ ఏడీఆర్ ఉమారెడ్డి, వ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ వెంకట్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రవీందర్‌రెడ్డి పంట సాగు విధానంపై కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు మట్టిపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఫలితాలకు తగ్గట్టుగా ఎరువులను వాడాలని తెలిపారు. కలుపు యాజమాన్యం సరైన సమయంలో చేపట్టాలని, రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత పంటకాలం పూర్తయ్యే వరకు రశీదులు భద్రపరచాలని తెలిపారు. పప్పు దినుసుల పంటలను ప్రభుత్వం చాలా వరకు దిగుమతులు చేసుకుంటుందని, ఈ పంటల సాగు విస్తీర్ణం పెంచుకోవాలన్నారు. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అశ్విని, మానస, విద్యార్థులు నందిని, నేహ, అంజలి, మెహరున్నీసా, మండల విస్తర్ణ అధికారి సత్య ప్రకాశ్, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్ధన్, వైస్ ప్రెసిడెంట్ భూమాత, రైతులు పాల్గొన్నారు.

లారీడ్రైవర్ నిర్లక్ష్యం.. యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలి

- ఇండికేటర్లు వేయకుండానే నడిరోడ్డుపై నిలిపిన లారీ
- వెనుకనుంచి ఢీకొట్టిన కారు..
- మృతుడిది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని



ఘటనా స్థలంలో మృతిచెందిన శివసాయి



లారీని ఢీకొట్టిన కారు

ఐనవోలు: మసకచీకటిలో.. నడిరోడ్డుపై ఇండికేటర్స్ వేయకుండా ఆగిఉన్న లారీని.. వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని వరంగల్–ఖమ్మం రహదారి పంథిని గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంనుంచి వరంగల్ వైపు సిమెంట్ బస్తాలతో వెళ్తున్న లారీని పంథిని గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నడిరోడ్డుపై ఆపిన డ్రైవర్ ఇండికేటర్స్ వేయకుండానే లారీ దిగి వెళ్లాడు. అదే సమయంలో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖనికి చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చింతకింది శివసాయి(29) తన పనుల నిమిత్తం సొంత కారులో ఖమ్మంనుంచి వరంగల్ వైపునకు వెళ్తున్నాడు. ఈక్రమంలో పంథిని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ ఫోకస్‌కు దారి కనిపించకపోవడంతో ఇండికేటర్స్ వేయకుండా రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో శివసాయి తల, శరీర భాగాలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. మృతుడికి ఇద్దరు అక్కలు, అమ్మ, నాన్న ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



సుధాకర్ (ఫైల్)

ఎల్కతుర్తి: మేక పిల్లలకు గడ్డికోసమని వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జగన్నాథ్‌పూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇల్లందుల సుధాకర్(35) మంగళవారం మేకపిల్లలకు గడ్డికోసుకొచ్చేందుకు వెళ్లాడు. బావిపక్కన గడ్డి కోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. సుధాకర్ రాత్రి 8 గంటలు దాటినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. తెల్లవారుజామున అటుగా వెళ్లిన గ్రామస్తుడు పొలం ఒడ్డుపైన ఉన్న చెప్పులు చూసి బావిలో పరిశీలించగా.. నీటిలో సుధాకర్ మృతదేహం కన్పించింది. కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారమందించారు. వారు మృతదేహాన్ని వెలికితీయించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అప్పులబాధతో యువకుడి ఆత్మహత్య



రఘు (ఫైల్)

బయ్యారం: అప్పులభారాన్ని తట్టుకోలేక ఓ యువకుడు పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా బయ్యారం మండలంలోని వెంకట్రాంపురంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుబ్బాకుల రఘు(35) ఏడు సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు కుటుంబంతో వెళ్లి టైల్స్ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల తల్లి సంవత్సరీకం నేపథ్యంలో వచ్చిన రఘు.. అప్పులు పెరిగాయనే మనస్థాపంతో ఈ నెల 2న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా.. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. రఘుకు భార్య ప్రవళిక, ఇద్దరు పిల్లలున్నారు. ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.